# అర్థం...కాదు!

—కొండపల్లి కోటేశ్వరమ్మ

కోయిల కూస్తూంది.

కొండ వురుముతూంది.

వాన కురిస్తే వాకిట్లో రాలిన ఆకులూ పరకలూ అంటుకుపోతాయని ఊడవడానికి లేచిన సుగుణమ్మ అత్తగారి పక్కలో నిదరోతున్న అరుణను లేపి చదివించమని అత్తగారికి చెప్పి వాకిట్లో కొచ్చింది....

అమ్మ చెప్పినట్టు నాయినమ్మ లేచి చదువుకోవే అంటే తనకూ తెలిసేది కాదు. అమ్మ నాయినమ్మను పిలవగానే లేచిపోదామనుకుంది. "రాత్రి పొద్దు పోయినా చదువుతూనే వున్నావు. ఆడపిల్ల ఆదమరచి నిద్రోయేది చిన్నప్పుడే కదా? పడుకోమని దుప్పటి కప్పకుంటే... తనకు మాత్రం తెలిసేదా?

నాన్న కేకలిన్న నిద్ర కాస్తా నాయినమ్మ దుప్పటి కప్పినా నిలబడక భయపడుతూ... పారిపోయింది. నాన్న పడుకున్నాడులే... రావే... అంటే... వస్తుందా?.. ఏంటీ...?

రాదు గాక రాదు.

నాయినమ్మ తను నిద్రోతున్నదని అనుకుంది. ది.. దుప్పటి కప్పిందిగా...? అమ్మ చదువుకుంటున్నానుకుంది నాయినమ్మను లేపమందిగా...? ముఖం మీద ముసుగు ఓ పక్కకు జారితే... వాన చినుకుల్లా అమ్మ కళ్లనీళ్ళూ, ఉరుముల్లా నాన్న కేకలూ వినిపిస్తూ... కనిపిస్తు

***

అమ్మ విన్న వాకిట్లో ముగ్గేసి వంటింట్లో పనిచేస్తుంటే... వానొచ్చింది. వానను చూసిన శ్రీనూ వాకిట్లోకెళ్ళి జల్లు మీద పడుతుంటే సంబరంగా అల్లీబిల్లీ తిరుగుతుంటే... కుర్చీలో కూర్చుని పేపరు చదివే నాన్న వాడ్ని చూస్తూ—

"ఏమేవ్! ఎక్కడ చచ్చావూ...? వాడు వాన్లో నానుతున్నాడు. జలుబుచేస్తుంది జల్లుపడితే... పిల్లాడు లేచెళ్లి ఆడతాడనే... ఆలోచనైనా రానంత పని చేస్తున్నావా... ఏంటీ...? వచ్చి వాడ్ని లోనికి తీసుకురా" అని అరచినట్టు, పిలిచాడు.

పేపరూపుకుంటూ అమ్మను కేకలతో పిలవకపోతే... ఎదురుగా కనిపించే వాడ్ని నాన్నే ఎత్తుకుని తీసుకురావచ్చుగా.. ..?



కత్తిపీట తగిలి వేలు రక్తం కారుతుంటే... గుడ్డయినా చుట్టకుండా"ఆ వస్తున్నా"నంటూ... పరుగున వాకిట్లోకి రాకపోతే..."కూరలు తరుగుతున్నాను. మీరే వాడ్ని తడవకుండా చూడండ"ని అమ్మైనా... అనొచ్చుగా...?

ఎంత పనిలో వున్నా – నాన్న మంచినీళ్లని కేకపెడితే... ఆ... వస్తున్నానంటూ గ్లాసుతో వస్తుంది గానీ... పనిలో వున్నాను ముంచుకు తాగండని అమ్మ అనదెందుకో?

తమ్ముడ్ని అమ్మ లాక్కెడుతుంటే... వాడు అంకెకు రాక అమ్మా ఆడుకుంటానే... అంటూ... మెలికలు తిరుగుతుంటే... మామయ్య తలపుకొచ్చాడు.

"వాన కురిస్తే... మెరుపు మెరిస్తే... ఆకసమున హరివిల్లు విరిస్తే... అన్నీ మావను పిల్లలారా!" పాడుతూ... మాతో ఆడుతూ... ఎంచక్కా... నవ్వుతూ... నవ్విస్తూ గెంతే... మామ!

ఆ... మామయ్యేనట నాకు 'అరుణ' అని పేరెట్టింది. మాటలొస్తున్న తమ్ముడు "మరి నాకో" అని అడిగితే... 'ఓరి బుడి బుడి నడకల బుజ్జాయీ నీ పేరు క్రాంతి కుమారన్నాడంట. మావయ్య వస్తూ ఎంచక్కని బొమ్మలూ, మిఠాయీ, పళ్లూ తెస్తాడు. మావయ్యొస్తే పండుగొచ్చినట్టే వుంటుంది. సర్దా సర్దాగా సంబరమొచ్చినట్టుంటుంది. అమ్మ కూడా అప్పడప్పుడూ కొంచెం కొంచెం నవ్వుతూ కనిపిస్తుంది.

"పిల్లలకు ఏమేమి యిష్టమో తెలుసుకుని తేగలిగాము... పెద్దవాళ్ల యిష్టాయిష్టాలు అంతగా తెలియవు. మీకిష్టమైన బట్టలు వగైరా తెచ్చుకోం"డని మామయ్య నాన్నకు డబ్బిస్తుంటే... నీవు నొచ్చుకుంటావని పుచ్చుకుంటున్నానంటూనే నాన్న మామయ్య చేతిలోనిది తీసుకున్నాడు. అమ్మ"అంతెందుకూ...?"అంటే – నాన్న అమ్మవైపు అదోలా చూశాడు. అమ్మ నోరిప్పక నేల చూస్తూ నిలబడింది.

మావయ్య వెళ్ళిపోతే సర్దా లేదూ... సందడీ లేదూ... ఇల్లు బోసిపోయినట్టుంది.

నాన్నకేమీ తెలియనట్టుగా అడిగాడు. నీ తమ్ముడ్ని నాలుగు రోజులుండమని అడిగినట్టున్నావు? దీపావళికి రమ్మని పిలిచినట్టున్నావు? గారెలొండి పెట్టినట్టున్నావు? తమ్ముడెల్లిపోయాడని దిగులుపడుతున్నట్టున్నావు? ఆడదానికి ఏదో పేరెట్టాడని వూరుకుంటే... ఆ అలుసుతో మగవాడిక్కూడా... ఆయనే పేరెడతాడా...? క్రాంతేమిటే? వాంతిలాగా...? నాకిష్టం లేదు. శ్రీనివాసని పిలవండని చెడామడా తిడుతూ... అమ్మ మాట్లాడక వింటుంటే... అలా బెల్లం కొట్టిన రాయిలా నిలబడ్డావే చెప్పని అమ్మని కసురుకున్నాడు గదా...?

గారెలొండితే... ఆయన తిన్నాడుగా... 'వండవా'... అని అమ్మనడగడం దేనికీ?

మామయ్య పెట్టిన పేరు తనకు నచ్చకుంటే... మామయ్యనే అడగొచ్చుగా...? అమ్మను తిట్టడం దేనికీ...? అసలు అమ్మ సర్దాగా... సంతోషంగా కనిపించడం నాన్న కిష్టం లేనట్టనిపిస్తుంది.

అమ్మ శ్రీనిని సముదాయించీ, స్నానం చేయించీ బడికి పంపేసరికి వంటకాలస్యమైనట్టుంది. ఆలస్యం కాకుండా ఎలా వుంటుందీ? గ్యాసైపోయి పది రోజులైంది. ఎంత తొందరగా అమ్మ లేచినా ఏదో ఒక సాధింపే కదా...? గ్యాస్ తెప్పించమని అమ్మడిగితే... కన్నారింటికి కబురు చేయమన్నాడుగా...?

మామయ్య డబ్బిస్తుంటే... నొచ్చుకుంటాడని పుచ్చుకున్నాయన అమ్మ డబ్బు పంపమని రాయడానికి నొచ్చుకుంటుందేమోనని ఎందుకనుకోలేదూ...? అర్థం కాదు.

చినుకులు పడితే పిల్ల తడుస్తూ బడికెడుతుంది. గొడుగు తెమ్మని నానమ్మడిగితే... తడిస్తే మొలకెత్తదులే... పరుసులో పైసా లేదన్న ఆయన వాకిట్లో కాలెడుతూనే గొడుగు తీస్తాడు. మొలకెత్తి పోతానని భయమేమోను?

చినుకులు చిక్కబడ్డాయి. వానీ



9-6-95 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

చూస్తూ వంటింట్లోకొచ్చిన నాన్న "ఏబ రాసీ ఇప్పటి వరకూ ఏం చేస్తున్నావూ? టైమెంతైందో తెలుసా...?" అరుస్తూ అమ్మనడిగాడు.

అమ్మ ఆదరా, బాదరా అన్నం వడ్డిస్తుంటే... కూరేమిటన్నాడు. "వరం వస్తుంటే మాంసం వండాలనే మామూలు ఆలోచనైనా రాలేదా? ఏదొండినా తినేస్తాడులే. అనీ, తోట పెంచుతున్నాననీ పప్పలో తోటకూర తగలేసి చట్టి దించావన్నమాట!" అన్నం కలపకుండా పళ్లు నూరుతూ అడిగాడు.

"మీరు తేందీ... ఇంట్లో లేందీ... ఎలా వండగలనూ...?" నేల చూస్తూ నింపాదిగా అంది అమ్మ.

అంతే... "ఎదురు సమాధానం చెపుతావా...? ఎక్కడ నుంచి వొచ్చిందే నీకీ ధైర్యం?" అమ్మ చెంప ఎర్రబడ్డా చెయ్యెత్తి కొడుతూ... అన్నాడు. "ఏడ్చావంటే... చంపేస్తా..."నంటూ అంగలేసుకుంటూ ఆఫీసుకో... ఎక్కడికో వెళ్లిపోయాడు.

తమ్ముడూ, నేనూ... అల్లరి చేస్తే నాన్న చిన్న దెబ్బకొట్టినా పెద్దగా ఏడుస్తాం. అమ్మ అల్లరీ చేయలేదూ... చిన్నదీ కాదు. పెద్ద దెబ్బ కొడితే... పెద్దగా ఏడుపు రాదా ఏంటి?... ఇంట్లో కూరలు లేని మాట నిజమే కదా? అబద్ధం చెపితే నన్ను కొడతానన్న నాన్న అమ్మ నిజం చెపితే... కొట్టడం దేనికీ...?

నాన్నంటే... నాకూ, తమ్ముడికే కాదు, అమ్మకూ, నాయనమ్మకూ కూడా భయమే వున్నట్టుంది. నాన్న బయటకెళ్లడం చూశాను కదా...? భయపడకుండా అమ్మ దగ్గరకెళ్ళాను. అమ్మ నాన్న చెప్పినట్టుగానే... పైకి ఏడవకుండా పీట మీద తల పెట్టుకుని కళ్ళూ, ముక్కూ కొంగుతో తుడుచుకుంటూ ఎక్కెక్కిపడుతూ కనిపించింది. దిండు తీసికెళ్లి అమ్మ తలకింద పెడుతూ... 'అమ్మా! ఏడవకంటూంటే నాకూ... ఏడుపొచ్చింది. అమ్మ ఉబ్బిన కళ్ళతో నావంక చూస్తూ "అరుణా నీవు నాలాగా ఏడవకూడదనే చదువుకోమంటాను. బడికెళ్లమ్మా" అంది.

బట్టలు మార్చుకుని పుస్తకాలు తీసుకుని చినుకులు మీద పడుతుంటే... చదువుకుంటే... ఏడ్చే పనుండదా... అనుకుంటూ బడికెళ్లాను. ఆలస్యంగా వచ్చినందుకు టీచరు చూసి అరుస్తుందనుకుని భయపడ్డాను.

'ఆత్మీయతా అనురాగం ఎంచుకునీ, పంచుకునే కుటుంబం కోసం, ఇల్లు వల్లగా ముంగిలి బంగారంగా దిద్దుకొనే చైతన్యం కోసం ఐక్యరాజ్యసమితి అంట ఆడవాళ్లను మీటింగులు జరపమందంట. మా టీచరుతో... మరో టీచరు చెపుతూంది. మా టీచరు అవన్నీ మీటింగులకూ... ఉపన్యాసాల వరకే ఉపకరిస్తాయంటూ నాకు అర్థం గాని మాటలేవో ఆమెతో చెపుతూ... నా వంకైనా చూడలేదు. అమ్మయ్య అనుకుంటూ క్లాసులో కూర్చున్నాను. మా టీచరును మీటింగుకు పిలిచిన టీచరు వెళ్ళిపోతుంటే... మా టీచరు ఆమె వంక చూస్తూ అదోలా, దిగులుగా అయిపోయింది. పాఠం చెప్పడం కూడా చేతగాని దానివలె చెప్పింది. క్లాసులో కూర్చోను బుద్ధిపుట్టనట్లైంది. ఇల్లే . తలపుకొస్తుంది.

బడి నుండి ఇంటికొచ్చిన శ్రీనూ చేతులలో చినుకులు పడుతూ ఆడుకుంటున్నాడేమో...?

నాన్న ఇంటికొస్తూ వాణ్ణి చూస్తూ అమ్మను తిట్టి కొడుతున్నాడేమో? నాయనమ్మ సాయంత్రం పురాణం వినేందుకెడుతుంది · కదా? అమ్మ వంటింట్లో వుంటుంది కదా? ఏడుస్తుంది కదా? శ్రీనూని చూస్తుందో లేదోను?

అవునూ... నాయినమ్మ పురాణం వింటుంది కదా...? బోలెడు విషయాలు తెలుస్తాయి కదా? నాన్న తమ్ముణ్ణి గుండెల మీద కూర్చోబెట్టుకుని ముద్దులాడుతూ... ఆడిస్తాడు. తను దగ్గరకెడితే... పొమ్మని కసురుతాడు. ఎందుచేతనని ఓసారడిగింది.

"వాడు తల కొరివెడతాడని అలా ముద్దుచేస్తాడు, ఆడిస్తాడు.

నీవు గుండెల మీద కుంపటి లాంటి దానివనుకుని పొమ్మంటాడంది."

గ్యాసు లేకపోతే... అమ్మ కళ్లు నులుపుకుంటూ కట్టెలతో వంట చేస్తుంది కదా? శ్రీనిని ఆడనీయొద్దని నాన్న అమ్మని కసురుకుని ముసుగులో దూరతాడు కదా? ఆట మానించినందుకు వాడికి కోపమొచ్చి కాలే కొరివి తెచ్చి నాన్న తల కంటించవచ్చును. నాయినమ్మ చెప్పింది నిజమే కావచ్చును. కాని నన్ను నాన్న గుండెల మీద కూర్చోబెట్టుకోడు కదా? కుంపటి లాంటిదాన్నని అనుకోను? నాన్న కసురుకున్నాడని కోపమొచ్చి ముసుగులో వున్నప్పుడు గుండెల మీద కుంపటి పెడతానను కున్నా... పొయ్యేగాని ఇంట్లో కుంపటి లేదు కదా? ఎందుకనుకుంటాడు? అర్థం... కాదు!

పెద్దవాళ్ళకు అన్నీ తెలుస్తాయనుకోవడం కూడా చిన్నవాళ్ళకు తెలివి లేకపోవడమేనేమోను?

బడి విడిచిపెట్టినా... ఆడబుద్ధికాదెందుకోను? భయమైనా ఇంటికెళ్లక తప్పదు కదా...?

ఇంటికాడ టీచరు చేసుకురమ్మన్న లెక్కలు చేస్తుంటే... ఒక్కదానికీ ఆన్సర్ రాదు.

నాయినమ్మ రెండు సార్లు అమ్మ దగ్గర కొచ్చి అన్నం తినమంది. "వాడు ఏ హోటల్లోనో... ఏ పలావో తినే వుంటాడు. నీవెందుకు అభోజనంతో ఏడుస్తావూ!"అంది. అన్నం తినమని అమ్మ చెయ్యి పట్టుకుంది. పెద్దది కదా? ఆకలికీ, నిద్రకు ఆగలేదు కదా...? తోటకూర పప్పతో అన్నం తిని పడుకుంది.

పది దాటినట్టుంది. నాన్న పూల పొట్లంతో లోనికొచ్చాడు. అమ్మ అన్నం తిందా? అని అడుగుతాడనుకున్నాను. అడిగితే తినలేదని చెప్తామనుకున్నాను. నన్నడగలేదు. ఇంట్లో ఎవ్వరన్నం తినకున్నా... అమ్మ బ్రతిమీలాడి అన్నం పెడుతుంది కదా? అలా అమ్మకు పెడతాడనుకున్నాను. అదేమీ లేకుండానే పొట్లం అమ్మ మీద కిసిరేసి పెట్టుకురమ్మని చెప్తూ... గదిలోకెళ్ళాడు.

పరుసులో పైసా లేదన్న నాన్న పలావెట్లా తిన్నాడూ? పూలెట్లా కొన్నాడూ? అబద్ధం చెప్తితే మమ్మల్ని చంపుతానని బెదిరించే ఆయన అబద్ధాలాడొచ్చునా...?


తను అన్నం తినకుంటే – నాయినమ్మ పూలెట్టను పొమ్మంటుంది కదా? అన్నం తినని అమ్మను నాన్న పూలెట్టుకు రమ్మనడం దేనికి? అర్థం కాదు.

నిన్నను చూస్తున్న అరుణను నాయినమ్మ లేపుతూ... "బారెడు పొద్దెక్కింది. అమ్మ నిన్నంతా అన్నం తినలేదు. పొద్దున్నే లేచిపోయింది. లేచి అమ్మకు సాయం చేయమ్మా" అంటూ కప్పిన ముసుగును తొలగించింది.

నిన్న వాకిట్లో పని ముగిసిన తరువాత నాన్నకు అమ్మ మీద కోపం మొదలైంది. ఈ రోజు పని మొదలెట్టగానే నాన్నకు అమ్మ మీద కోపం మొదలైంది. "ఈ రోజు ఎలా వుంటుందో" అనుకుంటూ భయంతో మంచం దిగింది అరుణ.

* * *

'తెలుగు కళాసమితి' (న్యూజెర్సీ), 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రిక, రాజాలక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కథలూ, కార్టూన్ల పోటీలో ఒక్కొక్కటికి రూ. 125/-లు బహుమతి పొందిన కార్టూను




బాలెం సత్యనారాయణ (పుష్ప)
చిన్న ఓగిరాల–521 245, ఉయ్యూరు (మం), కృష్ణాజిల్లా